క్లుప్తంగా

ఘనంగా జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం



ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రదీప్ వర్మ

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం ఎస్ఆర్ రంగనాథన్ జయంతి పురస్కరించుకుని లైబ్రేరియన్స్‌డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ ప్రదీప్ వర్మ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రంగనాథన్ తొలి గ్రంథ పాలకుడిగా ఎనలేని సేవలు అందించారన్నారు. లైబ్రేరియన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. కళాశాల లైబ్రేరియన్ కారుమూరి రామకృష్ణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాళ్లు ప్రసాద్, శాంతారావు, ఏవో సుబ్బరాజు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

కేజీహెచ్‌కు తరలింపు



ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

గోపాలపట్నం: రోడ్డు దాటుతున్న పాదచారుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయలయ్యాయి. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు .. గుర్తు తెలియని యువకుడు గోపాలపట్నం సీఎంఆర్ దుకాణం వైపు నుంచి దాటుతుండగా ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం వైపు వస్తున్న ఆర్‌టీసీ బస్సు ఢీకొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడు. దీంతో స్థానికులు సపర్యలు చేసి 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అయితే ప్రమాదానికి గురైన వ్యక్తి వివరాలు తెలియరాలేదు. వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని గోపాలపట్నం పోలీసులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న యువకులను రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు. జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు ఆదేశాలతో రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎంఎల్ మీనా రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం బోలంగిర్‌కు చెందిన దోలమని రానా, బీహార్‌కు చెరందిన శివశంకర్ రేలు గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. విశాఖ మీదుగా ముంబై, హౌరాలకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరి నుంచి సుమారు రూ.77,500 విలువైన 15.5కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని జీఆర్పీ ఎస్ఐ శాంతారంకు అప్పగించగా, వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

పాత నేరస్తుడు అరెస్టు

విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీసులు సోమవారం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా గంజాయి కేసులో తప్పించుకుతిరుగుతున్న నిందితుడ్ని అరెస్టు చేసినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు తెలిపారు.

కృష్ణా డిగ్రీ కాలేజీ ప్రవేశాల జాబితా విడుదల

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి అర్హుల జాబితాను విడుదల చేశారు. విద్యార్థులు ఈ నెల 16వ తేదీలోగా అలాట్‌మెంట్ ఆర్డర్‌తో పాటు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లి ప్రవేశం పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మట్టి రోడ్డును తలపిస్తున్న వెంకటాపురం రహదారి



రైల్వే అండర్ పాస్‌వే వద్ద ఇలా..

ప్రయాణం.. నరకప్రాయం

గోపాపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. చినుకు పడితే నడవడానికి వీల్లేని పరిస్థితి ఉంది. వెంకటాపురం నుంచి శ్మశాన వాటికకు వెళ్లే రహదారి, ఇక్కడి నుంచి కొత్తపాలెం వెళ్లే రహదారి మరింత దయనీయంగా ఉంది. రైల్వే బ్రిడ్జ్(5మదాల వద్ద) బురద మయంగా, గోతులు, రాళ్లతో నిండి ఉంది. వర్షం పడితే ఈ రోడ్డులో నడిచి వెళ్లేందుకు కూడా వీల్లేని విధంగా తయారవుతోందని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధికి కృషి చేసినా రైల్వే అధికారుల అనుమతి లేక పోవడంతో నిలిచి పోయింది. ఇంతలో ప్రభుత్వం మారి పోవడంతో పనులు నిలిచి పోయాయి. కూటమి నాయకులు, అధికారులు చొరవ చూపి రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో పద్మనాభనగర్‌కు వెళ్లే దారిలో కొంత మేర బీటీ రోడ్డు వేశారని మిగిలిన రహదారి కూడా బీటీ రోడ్డు వేసి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు విన్నవిస్తున్నారు.



వెంకటాపురం నుంచి కొత్తపాలెం వెళ్లే రోడ్డు దుస్థితి

ట్రాన్స్‌కో.. మేలుకో!

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



మల్కాపురం నుంచి త్రినాథపురం వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



నేవీ క్వార్టర్స్‌కు సమీపంలో నేలను తాకేటట్టుగా ట్రాన్స్‌ఫార్మర్

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు మల్కాపురం **నుంచి త్రి**నాథపురం వెళ్లే దారిలో విద్యుత్ ట్రాన్స్ **ఫార్మర్లు ప్ర**మాదకరంగా ఉన్నాయి. కంచెలు లేక **పోవడంతో** పశువులు మృత్యువాత పడుతు**న్నాయి. ర**హదారుల పక్కన ఎలాంటి కంచెలు **లేకుండా** నేలను తాకేటట్టు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా ప్రమాదాలకు ఆస్కారం ఉందని పలుమార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. బిల్లులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ ప్రజాసమస్యలను పరిష్కరించడంలో లేదని ప్రజలు మండిపడుతున్నారు. వర్షాకాలం కావడంతో ఇటువంటి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని భయపడుతున్నారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు ఎత్తు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్.ఆర్.రంగనాథన్ సేవలు స్ఫూర్తిదాయకం



ఎన్ఎస్ఎస్ పీవో భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న గ్రంథాలయాధికారులు

మల్కాపురం: గ్రంథాలయోద్యమ నేత ఎస్ఆర్ రంగనాథన్ సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటరావు అన్నారు. రంగనాథన్ సూచించిన విధంగా గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలన్నారు. రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని మల్కాపురం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లైబ్రరీ సైన్స్‌కు గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎస్.ఆర్.రంగనాథన్ అని అన్నారు. నేడు అపార విజ్ఞానాన్ని జాగ్రత్తగా నిక్షిప్తం చేయడానికి రంగనాథన్ కారకుడని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ గ్రంథాలయ అధికారులను అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.యస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవి, ప్రముఖ కవి సత్తిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉపాధ్యక్షుడు నూకరాజు, చోడవరం, సబ్బవరం, దేవరాపల్లి, గోపాలపట్నం, పెందుర్తి, పెదగంట్యాడ, మల్కాపురం, మహారాణిపేట, అల్లిపురం తదితర ప్రాంతాల గ్రంథాలయాధికారులు పాల్గొన్నారు.

పోలమాంబ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు



పోలమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులో పోలమాంబ అమ్మవారి పండగను ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి 30 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలను వైభవంగా జరిపించాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

మత్తు జోలికెళ్తే జీవితం చిత్తు

- యువత ఉన్నత లక్ష్యం వైపు వెళ్లాలి
- సీఐ విద్యాసాగర్



సదస్సులో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

సింథియా: జీవితాలను, భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మల్కాపురం సీఐ ఎస్.విద్యాసాగర్ సూచించారు. జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో సోమవారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు వద్దు–జీవితం ముద్దు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీవైఎఫ్ఐ జోన్ అధ్యక్షుడు ఎస్.వాసు అధ్యక్షతన జరిగిన సదస్సులో సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగానికి యువత, విద్యార్థులు బానిస కావడంతో ఆందోళనకర విషయమన్నారు. దీని వల్ల భవిత అంధకారం అవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డల అలవాట్లు, కదలికలపై జాగరుకతతో వ్యవహరించాలని సూచించారు. పిల్లల చెడుమార్గాల వైపు వెళ్లకుండా ముందు నుంచే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్తుపదార్థాల వల్ల యువత శారీరకంగా, మానసికంగా త్రీవంగా బలహీనపడతారని, భవిష్యత్తు నాశనం అవుతుందని అన్నారు. మత్తు పదార్థాలు అమ్మినా, సరఫరా చేసినా, సేవించినా చట్టపరమైన శిక్షలకు గురవుతారని హెచ్చరించారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మరడాన జగ్గునాయుడు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మద్యం, మత్తు పదార్థాల వల్ల యువతతో పాటు వారి కుటుంబాలు సర్వం కోల్పోతున్నాయన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల అక్రమార్కుల చేతుల్లో కోట్ల రూపాయలు పోగువుతన్నాయని, సామాన్య నిరుపేదలు మాత్రం మత్తుకు బానిసలై ఉపాధి కోల్పోయి జైలు పాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంటారావు, క్రాంతినగర్ బాపూజీ గ్రామాభ్యుదయ సంఘం అధ్యక్షుడు కె.పరదేశినాయుడు, ప్రధానకార్యదర్శి రమణమూర్తి, సీనియర్ సలహాదారు తోట రత్నం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు



వీధి కుక్కల దాడిలో కౌశిక్‌కు అయిన గాయం

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో 3 సంవత్సరాల బాలుడు రెడ్డి కౌశిక్‌ను వీధి కుక్కల కరిచి, గాయపరిచాయి. వివరాలివి.. క్రాంతినగర్‌లో భవన నిర్మాణ కార్మికుడు రెడ్డి సత్యనారాయణ కుటుంబంతో నివసిస్తున్నారు. సత్యనారాయణ కుమారుడు కౌశిక్ సోమవారం ఆరుబయట ఆడుకుంటున్న సమయంలో, వీధికుక్కలు అమాంతం మీదపడి దాడి చేశాయి. దీంతో బాలుడు బిగ్గరగా అరవడంతో, చుట్టుపక్కల వారు పరుగున వచ్చేసరికి, కుక్కలు పారిపోయాయి. గాయపడిన కౌశిక్‌ను కుటుంబసభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వీధి కుక్కలు చిన్నపిల్లలపై, వృద్ధులపై, వాహనదారులపై తరచూ దాడి చేసి గాయపరుస్తున్నాయని ప్రజలు తెలిపారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుండి కాపాడాలని కోరుతున్నారు.

గ్రానైట్ పలక పడి వ్యక్తి మృతి



మృతుడు రాము (ఫైల్)

గోపాలపట్నం: జీవీఎంసీ 51వ వార్డు సీతన్న గార్డెన్‌లో గల గ్రానైట్ పలకల దుకాణంలో లోడింగ్ చేస్తుండగా ప్రమాద వశాత్తు పలక పడి రోకల రాము అనే కలాసి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎండాడ పరిధి శాంతినగర్‌కు చెందిన రోకల రాము(39) కొంత మంది కలాసీలతో పలకలు లోడింగ్ చేస్తుండగా ఒక పలక ప్రమాదవశాత్తు రాము తలపై పడింది. దీంతో తీవ్రంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం తెలియగానే ఘటనా స్థలానికి చేరుకున్న ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు వివరాలు సేకరించారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించేందుకు యత్నిస్తుండగా బంధువులు, కలాసీలు అడ్డుకున్నారు. రాము కుటుంబానికి తగిన నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతుడు రాముకు భార్య రామసూరి, ఇద్దరు కుమారులు ఉండగా చిన్న కుమారుడు ప్రసాద్ మూడేళ్ల కిందట బీచ్‌లో ఈతకు వెళ్లి మృతి చెందాడు. ఇప్పుడు ఇంటికి పెద్ద దిక్కైన రాము మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఎట్టకేలకు ఆందోళన విరమించడంతో రాత్రికి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

ర్యాగింగ్ రహితంగా ఆంధ్రా యూనివర్సిటీ



ర్యాగింగ్ రహిత క్యాంపస్ ప్రారంభోత్సవంలో ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ విజయ్‌మోహన్

విశాఖ సిటీ: ర్యాగింగ్ రహితంగా ఆంధ్రా యూనివర్సిటీని నిలపాలని విద్యార్థులకు ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ పిలుపునిచ్చారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ర్యాగింగ్ రహిత క్యాంపస్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ కారణంగా యువత జీవితం నాశనమవుతోందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడటం, ప్రోత్సహించడం సరికాదని, విద్యార్థుల మధ్య స్నేహభావం, సత్సంబంధాలు ఎంతో అవసరమని సూచించారు. ఏయూను ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే విద్యార్థి వ్యవహారాల కార్యాలయానికి తెలియజేయాలని కోరారు. నిరంతరం విద్యార్థులకు ఆచార్యులు, సిబ్బంది అవసరమైన సహకారాన్ని అందిస్తారని చెప్పారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య విజయ్‌మోహన్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని సూచించారు. యువతరం విలువైన మానవ, మేధో వనరులుగా నిలవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆచార్య పాల్ డగ్లస్, ఆచార్య ఎస్.ఎం.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి ఇసుక డిపోను తనిఖీ చేసిన కలెక్టర్



కొనుగోలుదారులను ఆరా తీస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

అగనంపూడి : అగనంపూడిలోని ఇసుక డిపోను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సోమ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక డిపోలో నిల్వలు, అమ్మకాల తీరు, రవాణా చార్జీల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఎంతవరకు అమ్మకాలు సాగాయి, ఏమేరకు నిల్వలు ఉన్నాయో రికార్డులు పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇసుక కోసం వచ్చిన కొనుగోలు దారులు, ట్రాన్స్‌పోర్టు సిబ్బందితో మాట్లాడారు. ఇసుక అందించడంలో సిబ్బంది నుంచి సహకారం ఉందా , ఇబ్బందులు ఏమైనా ఉన్నా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గాజువాక మండల రెవెన్యూ సిబ్బందితోపాటు గనుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

మోడలింగ్‌లో మెరిసిన రిషిక



రెండో స్థానంలో నిలిచి, ట్రోఫీ కైవసం చేసుకున్న తన్వీ రిషిక

డాబాగార్డెన్స్: థాయిలాండ్‌లో జరిగిన జూనియర్ మోడల్స్ ఇంటర్నేషనల్ పోటీలో నగరానికి చెందిన తన్వీ రిషిక విశేష ప్రతిభ కనబరచి రెండో స్థానంలో నిలిచింది. వివిధ దేశాల విజేతల మధ్య జరిగిన హోరాహోరీ పోటీల్లో ప్రి టీన్ కేటగిరీలో నగరానికి చెందిన తన్వీ రిషిక రెండో స్థానంలో నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. కాస్ట్యూమ్స్ విభాగంలో బెస్ట్ రిప్రజెంటేషన్ ఫ్రమ్ ఇండియా, సూపర్ టాలెంట్ ఆఫ్ సీజన్ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా తన్వీ రిషిక మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇప్పటికే చాలా ఫ్యాషన్ షోల్లో విజేతగా నిలిచానని తెలిపింది. రిషిక తండ్రి సురేష్‌కుమార్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తన కుమార్తెకు ఉన్న ఆసక్తిని గుర్తించి ఫ్యాషన్ రంగంలో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. తన్వీ తల్లి ప్రసన్న రేణుక మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన ఆంధ్రా ఫ్యాషన్ పోటీల్లో కూడా తన కుమార్తె విజేతగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ రంగంలో జారీ ఎత్నిక్ వేర్, సూర్యప్రభ నందిని, రోహిత్, అరుణ్‌రతన్, నరేస్ మాష్టర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉక్కుపై కుట్రలు తగవు

- కేంద్రం ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలి
- స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రామచంద్రరావు



మాట్లాడుతున్న స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రామచంద్రరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడున్నరేళ్లుగా ఉక్కు కార్మికులు ఉద్యమాలు చేస్తున్నా కేంద్రం విశాఖ ఉక్కును నష్టపరిచే చర్యలు కొనసాగిస్తూనే ఉందని ఆరోపించారు. పోరాటాల వల్ల ప్రైవేటీకరణ చేయకపోయినా విశాఖ ఉక్కును పూర్తిగా నిర్వీర్యం చేసి అమ్మేసే ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. మూడు బ్లాస్ట్‌ఫర్నేసుల్లో ఒకటి మూడేళ్లుగా మూసేసారని, మిగిలిన రెండింటిని కూడా మూసి వేసే పరిస్థితి కేంద్రం తీసుకు వస్తుందన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం తక్షణం ఆదుకోకపోతే లక్షలాది కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. పది వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చాలని, అవసరమైన రా మెటీరియల్ సకాలంలో అందేలా చేసి పూర్తిస్థాయిలో ఉత్పత్తిని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి ప్లాంట్ సందర్శనలో ఆదుకుంటామి భరోసా ఇచ్చినా ఇంత వరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.వి. రమణమూర్తి, ప్రభాకరరెడ్డి, బి.ఎస్. రాజు, ఎస్.ఎ. నాయుడు, మోహన్, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఇంటక్ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించడంతో పాటు సొంత గనులు కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ కోరారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, తక్షణ సాయంగా రూ.ఐదువేల కోట్ల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 1287వ రోజు దీక్షా శిబిరంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, రమణమూర్తి, సుబ్బయ్య, కొరివి అవతారం, ఎస్.నాయుడు, గోపాలరాజు, సాహు, ప్రసాద్, గోపి, శ్రీనివాస్, దేముడు, వేణువర్మ, కొమ్మ ప్రసాద్, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

10వేల మందితో త్రివర్ణ పతాక ప్రదర్శన రేపు

డాబాగార్డెన్స్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం వైఎస్సార్ సెంట్రల్ పార్క్‌లో 10 వేల మంది విద్యార్థులతో..25వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించనున్నట్టు స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేవ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి కోరారు. కార్యక్రమంలో గొల్ల ప్రదీప్‌రాజు, కర్రి నరేష్, ఇషాక్ మహ్మద్, పీవీకే కుమార్, శివ దల్లై, తమ్మన విజయ్, శ్రీకాంత్, రామాయణం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లర సమస్యకు చెక్

క్యూఆర్ కోడ్ స్కానర్ల ఏర్పాటు



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కానర్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు టికెట్ కోసం ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. దీని ద్వారా చిల్లర సమస్యకు కూడా చెక్ పెట్టారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేందుకు వీలుగా మూడు చోట్ల క్యూఆర్ కోడ్ స్కానర్లు ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలో నిల్చోవాల్సిన పరిస్థితి లేకుండా వీటిని ఏర్పాటు చేశారు. ఒకటో ప్లాట్‌ఫాం టికెట్ కౌంటర్ల వద్ద, మరొకటి రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేశారు. రైల్వే ప్రయాణికులు వీటిని సద్వినియోగపర్చుకోవాలని అధికారులు కోరుతున్నారు.